క్లుప్తంగా

చదువుతోనే బంగారు భవిష్యత్



బాలికలతో మాట్లాడుతున్న ఎస్ఐ హనుమంతురెడ్డి

దొర్నిపాడు: బాలికలకు చదువుతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎస్ఐ హనుమంతురెడ్డి అన్నారు. గురువారం అమ్మిరెడ్డినగరంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పదితోనే చదువు ఆపొద్దని ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకుగా ఆండగా ఉండాలన్నారు. బాల్యవివాహలు నేరమని ఇళ్లకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

జేఈఈ ఫలితాల్లో రావూస్ విద్యార్థుల ప్రతిభ



ఫలితాలు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రావూస్ విద్యార్థులు ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మోనిచంద్ర గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పూర్ణేష్‌రావు, హర్ష, శ్రావ్య, సభ, తౌఫిక్ హుసేన్, వెంకటహరీష్, గురునాథరెడ్డి, శశాంక్ కుమార్‌రెడ్డి, ఎస్ఎండీ ఓమర్ షాకీర్ 87 శాతం నుంచి 98 శాతం వరకు ఫలితాలు సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

మహిళలపై దాడి హేయం



మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: వ్యవసాయ కూలి పనులకు వెళ్లి వస్తున్న దళిత మహిళలపై దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్ రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొట్టకూటి కోసం శనగ కట్టె కోయడానికి కూలీ పనుల నుంచి ఇంటికి తిరిగొస్తున్న కూలీల ఆటోను ఆపి శనగకట్టె తెచ్చుకుంటున్నారనె నెపంతో ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులైన చింతకుంట టీడీపీ నాయకులు 40 మంది దళిత మహిళా కూలీలను దూషిస్తూ విచక్షణా రహితంగా కొట్టి గాయపరచడం దుర్మార్గపు చర్య అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసంఘటిత కార్మికులు నమోదు చేసుకోవాలి

దొర్నిపాడు: ఈ శ్రామ్ పోర్టల్‌లో ఉచితంగా అసంఘటిత రంగ కార్మికుల నమోదు చేసుకోవాలని దీంతో కార్మికులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఎంపీడీఓ సావిత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో చేరిన ప్రతి అసంఘటిత కార్మికుడికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబర్) ఇస్తారన్నారు. వ్యవసాయ, చిన్న,సన్నకారు రైతులు, పాడిపరిశ్రమ, నర్సరీలు, మత్స్యకారులు, భవన మరియు అనుబంధ రంగాల్లో పనిచేసేవారు అర్హులన్నారు. ఆటోమొబైల్, రవాణా రంగం, చేతివృత్తుల పనివారు, సేవారంగం, దుకాణాలు, ఆహార పరిశ్రమల్లో పనిచేసేవారు కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో, కామన్ సర్వీస్ సెంటర్స్‌లో నమోదు చేస్తారని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

18న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

డోన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ స్థానిక గుండా వెంకటరత్నంశెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మేళాలో టాటా క్యాపిటల్, పేటీఎం, క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ ప్రైవేట్ లిమిటెడ్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7981238237 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కూలీల కొరత..



డబ్బ్వా గోవిందిన్నె సమీపంలో మిరప కోత పనుల్లో కూలీలు



దొర్నిపాడు వద్ద కూలీలు లేక పత్తిని కోయలేని దృశ్యం

ప్రస్తుతం పంటకోత పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో కూలీలు బిజీగా ఉన్నారు. మిరప, పత్తి పనులకు తప్పని సరిగా కూలీలే అవసరం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిరప పంట తొలి కోతలు జోరందుకోవడంతో కూలీలంతా ఆ పనులకే వెళ్తున్నారు. దీంతో పత్తి తీసేందుకు కూలీలు కరువవడంతో పొలాల్లో ఎక్కడ చూసిన తెల్లబంగారం మొక్కలకే పరిమితమైంది. కాగా..జొన్న, శనగ, మినుము, కంది పంటలను యంత్రాల ద్వారా నూర్పిడి చేయించుకుంటున్నారు. –దొర్నిపాడు

కార్గోఫ్యూరాన్‌తో కత్తెర పురుగు నివారణ



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరాకు 8–10 కేజీల కార్గోఫ్యూరాన్‌ను మొక్క సుడుల్లో వేస్తే పురుగును నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి ప్రభావతమ్మ తెలిపారు. ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని భీమవరం గ్రామంలో కత్తెర పురుగు నివారణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించిన అనంతరం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పైరును కత్తెర పురుగు ఆశిస్తే పంట దిగుబడులు తగ్గుతాయని, ఎకరాకు 6–8 లింగాకర్షక బుట్టలు, పంటలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో పాటు ఐమా మెక్టిన్ బెంజోయేట్ 0.5గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలో ఏడు సంవత్సరాలుగా ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేకపోవడం దారుణమని, వక్ఫ్ బోర్డు స్థలంలో ఇక్రా పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాలను కొనసాగించాలని, సొంత భవనం నిర్మించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాముడు, క్రిస్టియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి జానయ్య అన్నారు. గురువారం పట్టణంలోని వివిధ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు శాశ్వత భవనం కేటాయించేందుకు మంత్రి ఫరూక్, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అలాగే..ఉర్దూ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్లు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు బాబావక్రుద్దీన్, సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్, రఘురాజు, రియాజ్, ఓబులేసు, వెంకట్, హర్షద్‌బాయి, జాకీర్‌బాయి, కాంగ్రెస్ నాయకుడు, మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కృషి

చాగలమర్రి: రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 9 నెలలలో రాష్ట్ర అభివృద్ధికి రూ.3 లక్షల కోట్లు మంజూరు చేసిందని, అలాగే.. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.12 వేల కోట్లు విడుదల చేసిందని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడిగా చంద్రమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి



శంకర్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని నూతన ఉప విద్యాశాఖ అధికారి డీటీ శంకర్‌ప్రసాద్ అన్నారు. నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈఓగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆర్‌జేయూపీ నాయకులు గురువారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ ప్రగతికి విద్యాశాఖ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య, ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజీ వీరబ్రహ్మం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవీప్రసాద్, నీలం వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, మస్తాన్‌వలి, నీలకంఠమాచారి పాల్గొన్నారు.

దత్తాత్రేయుడికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 40గంటల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల మండల లీగల్‌సెల్ చైర్మన్ జిల్లా మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన సామాజిక కార్యకర్తలు, నిపుణులు, నిష్ణాతులు, ఇతర నైపుణ్యాలు కలిగి ఉండి కనీసం 15సంవత్సరాలు సంబంధిత రంగాల్లో అనుభవం కలిగిన లేదా ఉన్నత స్థానాల్లో పని చేసి పదవీ విరమణ పొందిన వారు, రిటైర్డు ఎగ్జిక్యూటివ్‌లు కర్నూలులోని మీడియేషన్ కేంద్రంలో మధ్యవర్తులుగా వ్యవహరించడానికి సుముఖంగా ఉన్నవారి నుంచి నంద్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూరించిన దరఖాస్తులను 17వ తేదీలోగా కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కోర్టు క్యాంప్లెక్స్ నంద్యాల అడ్రస్‌కు దరఖాస్తును పంపాలని సూచించారు.

18న దేవాలయ స్థలానికి బహిరంగ వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం ఖాళీ స్థలం లీజుకు ఈనెల 18వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామానుజన్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 453లో మూడు ఎకరాల ఖాళీ స్థలం 11సంవత్సరాల లీజుకు ఇచ్చేందుకు ఈ టెండర్ షీల్డ్ కొటేషన్ ద్వారా బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెండర్ కోసం https://tendereprocurment.gov.inలో చూడాలని, షీల్డ్ కొటేషన్ సమర్పించేవారు 18వ తేదీ ఉదయం 10గంటల్లోపు దేవస్థానం టెండరు బాక్స్‌లో టెండరు వేయవచ్చన్నారు. అదే రోజు ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని చెప్పారు. ఆసక్తి గల వారు సెల్ 9440306907 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నెలాఖరులోగా పశుగణన పూర్తి చేయాలి




పాత ముచ్చుమర్రి పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరావు

పగిడ్యాల: ఈనెలాఖరులోగా పశు గణన సర్వేను పూర్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పడమర ప్రాతకోట, పగిడ్యాల, పాత ముచ్చుమర్రి పశుగణాభివృద్ధి కేంద్రాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి తూర్పు గోదావరి జిల్లాలో వెలుగు చూసినందున మండలంలో ఏమైనా కోళ్ల ఫారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. గొర్రెలకు మసూచి టీకాలు వేయడం ఎంత శాతం పూర్తి చేశారని ఆరా తీశారు. ఇంకా బహువార్షిక పశుగ్రాసాల పెంపకాన్ని ఎంత విస్తీర్ణంలో సాగు చేయిస్తున్నారో వివరాలు తెలుపాలని కోరారు. వేసవిలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని పశుపోషకులకు వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించి పశు నష్టం సంభవించకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. పశు సంపద వృద్ధిలో అందరూ భాగస్వాములై డైరీ యూనిట్లను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పడమర ప్రాతకోటలో పూర్తి స్థాయి తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రుతికీర్తి, సుమన్, రాగసంధ్య ఉన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి 56 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 56 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్షలు – 11, బీఈడీ పరీక్షలు – 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షలకు 321 మందికిగాను 275 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారని, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ పరీక్షలకు 76 మందికి 66 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న దేవస్థాన అధికారులు, సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృత పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి పెద్దసత్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రధాన రహదారులు, ఆలయ మాడవీధులు, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, అన్నప్రసాద వితరణ పరిసరాలు, సీఆర్ఓ కార్యాలయ పరిసరాలు, దర్శన కాంప్లెక్స్, గంగా, గౌరీ సదనాలు, టూరిస్ట్ బస్టాండ్, మల్లమ్మ కన్నీరు, పంచమఠాల పరిసరాలు, పీహెచ్‌సీ మొదలైన చోట్ల ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన ఏఈఓలు, పర్యవేక్షకులు, పలు విభాగాల సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్–167 కే పనులు త్వరలో ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం నుంచి నంద్యాల వరకు నిర్మించబోయే జాతీయరహదారి 167 కే పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు ఏఈ రవికాంత్ గురువారం తెలిపారు. ఎన్‌హెచ్–167కే నిర్మాణ పనులు మార్చిలో ప్రారంభం కానున్నాయన్నారు. సంగమేశ్వరం నుంచి నంద్యాల జిల్లా కేంద్రం వరకు 620.279 ఎకరాల భూమిని సేకరించామన్నారు. భూ సేకరణ రైతులకు నష్టపరిహారం దశలవారీగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఎన్‌హెచ్‌ఓ కన్వర్షన్‌కు రూ.776.17 కోట్లతో 62.571కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ రహదారిని పది మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు.

నీటి ముంపు నిర్వాసితుల ధ్రువపత్రాల పరిశీలన

పగిడ్యాల: శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో సర్వం కోల్పోయిన నీటి ముంపు నిర్వాసితులైన అవార్డుదారుల ధ్రువపత్రాలను హెచ్ఎస్ఏస్ యూనిట్ 4 అధికారులు పరిశీలించారు. గురువారం మండలంలోని బీరవోలు గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి అవార్డుదారుల వివరాలను తెలుసుకున్నారు. నష్టపరిహారం కోసం గతంలో లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించిన అవార్డుదారులకు పరిహారం చెక్కులు అందించేందుకు ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మధు తెలిపారు. బీరవోలులో సుమారు 491 మందికి పరిహారం చెక్కులు పంపిణీ చేసేందుకు అవార్డుదారుల నుంచి వారు జీవించి ఉంటే ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. అవార్డుదారులు మరణిస్తే వారి రక్తసంబంధీకుల నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మరణ ధ్రువపత్రం, సెల్ఫ్ అఫిడవిట్, ఆధార్, బ్యాంక్ పుస్తకం జిరాక్స్ కాపీలను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఎస్ఏస్ యూనిట్ 4 డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో భగవాన్‌దాస్, వీఆర్ఏలు ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఫారెస్ట్ అధికారిణి నాగమల్లేశ్వరి

వెలుగోడు: వసతి గృహంలో ఉన్న విద్యార్థులు మంచిగా చదివి అత్యున్నత మార్కులు సాధించాలని నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారిణి నాగమహేశ్వరి తెలిపారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఉన్నటువంటి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్‌కు కావాల్సిన ప్యాడ్, పెన్ను తదితర సామగ్రిని పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. హాస్టళ్లలో అన్ని వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి మధుసూదన్ రెడ్డి, సీనియర్ సహాయకులు నాగన్న, హాస్టల్ వార్డెన్ రాజు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

అడవిలో రోడ్డు పనులు



గ్రావెల్ వేస్తున్న దృశ్యం



అడవిలో ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టారు. నాగం బావి నుంచి ఫాల్కన్ బేస్ క్యాంప్, సిల్లమానుపెంట వద్ద ఏర్పాటు చేసే బేస్ క్యాంప్‌ల మీదుగా ఉల్లెడ మల్లేశ్వరస్వామి ఆలయం వైపు రోడ్డు పనులు సాగుతున్నాయి. ఆ రోడ్డు ఎన్నో ఏళ్ల క్రితం వేసింది కావడంతో వర్షాలకు దెబ్బతిని అస్తవ్యస్థంగా మారింది. అలాగే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు వంటివి ఏపుగా పెరిగి రాకపోకలకు అంతరాయంగా మారింది. కొత్తగా అటవీ సంరక్షణ కోసం బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం, వాటి వద్దకు అధికారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పరిస్థితిని గుర్తించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు దాదాపు రూ.5లక్షలు మంజూరు చేసినట్లు రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. ఆ నిధులతో స్థానిక అధికారులు గుంతలమయం అయిన చోట గుండ్రాళ్లు పరచి వాటిపై గ్రావెల్ తోలి డోజర్‌తో చదును చేయిస్తున్నారు.

టిడ్కో గృహాలకు లబ్ధిదారు వాటా చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోనున్న టిడ్కో గృహాలకు లబ్ధిదారుని వాటాను మున్సిపాలిటీలో జమ చేసి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఉత్తర్వుల మేరకు టిడ్కో గృహాల కేటగిరి–1 300 చదరపు మీటర్లు రూ.500 వాటా చెల్లించాలన్నారు. కేటగిరి–2 కింద 365 చదరపు అడుగుల లబ్ధిదారు ముందస్తు వాటా రూ.50వేలు ఉన్నట్లు తెలిపారు. ముందుగా రూ.25వేలు మాత్రమే చెల్లించాలన్నారు. అలాగే 430 చదరపు అడుగుల టిడ్కో గృహానికి రూ.లక్ష ముందస్తు వాటా ఉండగా రూ.50వేలు మాత్రమే చెల్లించాలన్నారు. తమ వార్డు సచివాలయంలో సరైన వివరాలతో దరఖాస్తు పత్రాలను, ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ అందజేయాలని వెల్లడించారు. మున్సిపాలిటీలో డీడీ రూపంలో జమ చేయాలన్నారు. టిడ్కో గృహం మంజూరు పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేయాలని కోరారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

బేతంచెర్ల: ప్రణాళికతో చదివితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం బేతంచెర్ల మండలం గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్, సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడిందని.. విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచించారు. తెలియని విషయాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితేనే ఎక్కువ మార్కులు సాధించవచ్చని తెలిపారు. కాగా మోడల్ స్కూల్‌లో స్టడీ అవర్‌ను పర్యవేక్షించాల్సిన బయాలజీ సబ్జెక్టు టీచర్స్ ఇద్దరు రాకపోవడంతో మెమో ఇచ్చారు. ప్రిన్సిపాల్ మానిటరింగ్ లోపం ఉందని ఆయనకూ మెమో జారీ చేశారు.

శివరాత్రి భక్తులకు అటవీశాఖ ఏర్పాట్లు



మాట్లాడుతున్న సబ్‌డీఎఫ్ఓ, రేంజర్

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అటవీశాఖ ఏర్పాట్లు చేస్తుందని సబ్–డీఎఫ్ఓ అబ్దుల్‌రవూఫ్, రేంజర్ సుభాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉన్నిపెంట అటవీశాఖ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 19 నుంచి మార్చి 1 వరకు 24 గంటలపాటు వాహనాల రాకపోకలకు అటవీశాఖ చెక్‌పోస్టులు తెరచి ఉంచుతామన్నారు. వెంటాపురం నుంచి కాలినడకన వచ్చే భక్తుల కోసం అక్కడక్కడా తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పర్వదినం సందర్భంగా రెండు లీటర్ల ప్లాస్టిక్ బాటిళ్లను భక్తులు తమ వెంట తీసుకురావచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు అందించే వైద్యసేవలు, భోజన సదుపాయం, తాగునీరు మజ్జిగ, ఇతర సదుపాయాలకు ఎటువంటి ఆంక్షలు ఉండవని అటవీశాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ హోటల్‌లో కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సాయంత్రం హోటల్‌లో పని ముగించుకుని ఇంటికి బయల్దేరింది. డిగ్రీ కళాశాల వద్ద కర్ణాటకకు చెందిన ఓ లారీ రోడ్డు కుడివైపు నుంచి ఎడమవైపు వచ్చే క్రమంలో పక్కనే నడిచి వెళ్తున్న జయమ్మను తాకింది. దీంతో ఆమె కిందపడిపోయింది. ఆమెపై నుంచే వాహనం వెళ్లడంతో కడుపు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ గమనించి వాహనం అక్కడే నిలిపివేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. గాయపడిన మహిళను స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనం, రక్షాబంధనం, దీక్షాధారనం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 16వ తేదీ వేదపారాయణం, రుద్రాభిషేకం, రుద్రహోమం, దీక్షా హోమాలు, దేవతామూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో చివరి రోజు 17వ తేదీ యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ఠ, బలిదానం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.